ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 10 సంచిక : 17 పుష్పం : 35-36 20-05-2005

రమణ భాస్కర
ఆధ్యాత్మిక పక్ష పత్రిక
పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥100/-
విడి ప్రతి : రూ॥ 8/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

05-02-05
పాలకోడేరు ............... 1

07-02-05
గుమ్మలూరు .............. 8

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-02-05, పాలకోడేరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏపని అయినా జయప్రదం అవ్వాలంటే మూడు కలిసిరావాలి. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం. ఈ మూడూ లేకుండా మనం ఏమీ చేయలేము. మనం పనిచేస్తూ ఉండాలి, కాలంకలిసి రావాలి, ఈశ్వరుని దయ ఉండాలి. ఈమూడూ ఉంటేనే ఆ పని సక్సెస్ అవుతుంది. కేవలం మన తెలివితేటలను బట్టి మన కృషిని బట్టి ఏపని పూర్తి అవ్వదు, ఈశ్వరుని దయ కూడా ఉండాలి. కృషి ఎంత ముఖ్యమో కృప కూడా అంతే ముఖ్యం. అర్జునుడు కృషి, కృష్ణుడు కృప. అర్జునుడు చేసిన కృషికి అక్కడ భగవంతుని దయ తోడుగా ఉంది కాబట్టి భారత యుద్ధంలో వారికి జయం కలిగింది. మహాత్ములకు దేహానికి సంబంధించిన చావుపుట్టుకలు వారికి ఏమీ తెలియవు. చావు పుట్టుకలు, జీవితంలో వచ్చే కష్టసుఖాలు, లాభనష్టాలు ఇవిఅన్నీ దేహానికి సంబంధించినవి. వారు దేహగతంగా ఉండరు కాబట్టి దేహం యొక్క పుట్టుకగాని, దేహం యొక్క చావుగాని, దేహానికి వచ్చిన గౌరవాలు అగౌరవాలుగాని, లాభనష్టాలుగాని అసలు వారి స్మృతిలో ఉండవు. అవి స్వప్నం మాదిరిగా అలా వస్తూఉంటాయి, పోతూఉంటాయి. మరణం అనేది నూటికి నూరుపాళ్ళు దేహానికి సంబంధించిన విషయం. మీరు ఏమీ కంగారు పడవద్దు, మరణించాక కూడా మనం ఉంటాము. మనం దేహాన్ని ఆత్మ అనుకొంటున్నాము. ఇది మనలో ఉన్న పెద్ద పొరపాటు. దేహానికి ఆత్మకు అసలు ఏమీ సంబంధం లేదు కాని మనం దేహము, ఆత్మ ఒక్కటే అనుకొంటున్నాము అందుచేత మనకు అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది. మనకు కుటుంబపరంగా వచ్చే కష్టాలు, ఆర్థిక

ఇబ్బందులు, సమాజపరంగా వచ్చే కష్టాలు, ప్రకృతి రీత్యా వచ్చే కష్టాలు, జననాలు, మరణాలు ఇవి అన్నీ కూడా క్షేత్రానికి సంబంధించినవి, క్షేత్రజ్ఞుడికి సంబంధించినవి కాదు అంటే పరమాత్మకు వీటితో సంబంధం లేదు.

మన శరీరం రాకముందు నారాయణుడు ఉన్నాడు, ఇప్పుడూ ఆయన ఉన్నాడు, మనం శరీరం విడిచిపెట్టాక రాబోయే కాలంలో కూడా నారాయణుడు ఉంటాడు. అంతా నారాయణ మయం. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో, అన్ని వస్తువులలో, అన్ని ప్రాంతాలలో నారాయణుడు ఉన్నాడు. నారాయణుడు లేకుండా ఏదీ లేదు. ఆ నారాయణుడే మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు, ఆ స్వరూపమే మనం కాని మనకు ఆ బుద్ధి కలగటం లేదు. మనం అనాత్మయందు ఆత్మబుద్ధి కలిగి ఉన్నాము, సత్యం కానిదాని పట్ల సత్యం అనే బుద్ధి కలిగి ఉన్నాము. నువ్వు లోపల తమోగుణం, రజోగుణాలతో కాలిపోతున్నావు. నీకు జ్ఞానం కావాలంటే ముందు నువ్వు సత్వగుణాన్ని అభివృద్ధి చేసుకో. సత్వగుణం కూడా గుణమే కాని నీ హృదయంలో ఉన్న నారాయణుడిని చేరుకోవటానికి దారి చూపించి అది ప్రక్కకు తప్పకొంటుంది, అందుచేత సత్వగుణాన్ని అభివృద్ధి చేసుకోవాలి. జ్ఞానంకాని, మరి ఏదైనా ఒక సబ్జక్టు కాని మనం బోధించేటప్పుడు ముందు మనం కష్టపడి, కష్టపడి దాని తాలుక అనుభవం మనం పొందాలి. అనుభవాన్ని పొందాక మనం ఎంత కష్టపడ్డామో అంతకష్టం ఇతరులకు రాకుండా వారికి జ్ఞానం కలుగజెయ్యాలి. జ్ఞానం సంపాదించటానికి నేను చాలా కష్టపడ్డాను అనుకోండి, నేను ఎంత కష్టపడ్డానో మీరందరూ కూడా అంత కష్టపడాలి అని నేను అనుకోకూడదు. సాధ్యమయినంతవరకు తక్కువ కష్టంతో ఆత్మ సింహాసనం మీద మిమ్మల్ని కూర్చోబెట్టాలి. నీ అనుభవాన్ని చిన్న చిన్న మాటలతో వారికి అర్థమయ్యేలాగ చెప్పి ఏ ఆనందానికి అయితే నువ్వు వారసుడివి అయ్యావో ఆ ఆనందానికి వారిని కూడా వారసుల్ని చెయ్యాలి. భగవాన్ రెండు నియమాలు చెప్పేవారు. సాత్వికాహారం తిను, సత్సంగం చెయ్యి. సత్యానుభవం కలగటానికి ఇవి రెండూ సరిపోతాయి. నీకు ఎలా తోస్తే అలా జీవించకు. నీ మనస్సు ఎటుగంతులు వెయ్యమంటే అటు గంతులు వెయ్యకు. వేదంలో ఉన్న మాటలకు అనుగుణంగా నీ మనస్సును తీర్చిదిద్దుకో. భగవంతుడు చెప్పిన మాటలకు అనుగుణంగా నీ జీవితాన్ని తీర్చిదిద్దుకో. అంతేగాని నా అభిప్రాయం ఇలా ఉంది కాబట్టి భగవద్గీత మారిపోవాలి, వేదం మారిపోవాలి, నేను ఎలా చెపితే అలాగ శాస్త్రంలో ఉండాలి అంటే ఇవన్నీ అహంకారం యొక్క చేష్టలు, అవిద్య యొక్క పరాకాష్ట, గర్వం యొక్క పరాకాష్ట. జ్ఞానానికి అనుగుణంగా నీ మనస్సును తీర్చిదిద్దుకో అంతేగాని నీ మనస్సుకు అనుగుణంగా జ్ఞానం ఉండాలని అనుకోవద్దు. మాయ అంతా మూడు గుణాలలో ఉంది.

ఈ గుణాలలో నీవు బంధింపబడి ఉన్నంతకాలం తిరిగి ఈ భూమి మీదకు వస్తావు. అక్షరమణమాలలో భగవాన్ అంటారు నేను ఈ భూమి మైకంలో పడి ఉన్నాను. ఈ గొప్పలు, తిప్పలు, గౌరవాలు, అగౌరవాలు వీటిలో మత్తెక్కి కొట్టుకొంటున్నాను, ఈ మత్తులో నుండి బయటకురాకుండా ఈ భూమి విడిచిపెడుతుందా, చావుపుట్టుకలు విడిచిపెడతాయా, వేదనలు రోదనలు విడిచిపెడతాయా అరుణాచలా అన్నారు. ఆంజనేయస్వామి రావణాసురుడితో ఏమన్నాడు అంటే నేను పెద్దరాజును నాకు అందరూ జడవాలి, వేదం కూడా నేను చెప్పినట్లు వినాలి అనుకొంటున్నావు. వేదం నువ్వు చెప్పినట్లు వినదు, అది చెప్పినట్లు నీవు వినాలి అని చెపుతూ రెండు మాటలు చెప్పాడు. 1. ధర్మం, 2. అధర్మం. మీరు పూర్వజన్మలో అధర్మం చేసారు అనుకోండి, ధర్మం కూడా చేసారు అనుకోండి. మీరు చేసిన ధర్మం అధర్మాన్ని కొట్టివేయదు. నీవు ధర్మానికి ఫలితాన్ని అనుభవించాలి, అధర్మానికి ఫలితం అనుభవించాలి. రెండింటికి ఫలితాన్ని నీవు అనుభవించాలి, రావణాసురా ఇది మర్చిపోవద్దు. నువ్వు ఎవడినో చంపావు అనుకో, అక్కడ రుద్రాభిషేకం చేసాను కదా అనుకోవద్దు. రుద్రాభిషేకం చేస్తే దాని ఫలితం నీకు వస్తుంది, వాడిని చంపిన ఫలితం కూడా నీవు అనుభవించాలి అని చెప్పాడు. నాకు సంతోషం కావాలి, దుఃఖం అక్కరలేదు అంటే కుదరదు. నువ్వు సంతోషాన్ని కోరుకున్నప్పడు దుఃఖం కూడా దాని వెనకాల వస్తుంది. ఎందుచేతనంటే ఈ సంతోషం, దుఃఖం ఇవి అన్నీ కూడా అహంకారానికే. మీకు సంసార పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి అనుకోండి అప్పడు మీకు సంతోషం వచ్చింది అనుకోండి, మరల పరిస్థితులలో మార్పు వచ్చింది అనుకోండి అప్పడు మీరు దుఃఖం అనుభవించ వలసిందే. సంతోషాన్ని అనుభవించినప్పడు దుఃఖాన్ని కూడా అనుభవించాలి. ఇప్పడు మనందరము ఇక్కడ రామాలయానికి వచ్చాము. మేము జిన్నూరు నుండి వచ్చాము, మీరు కొంతమంది భీమవరం నుండి వచ్చారు, కొంతమంది నర్సాపురం నుండి వచ్చారు. ఎక్కడ నుండో, ఎక్కడ నుండో అందరం ఇక్కడకు వచ్చాము. ఇక్కడకు వచ్చాక రామాలయంలోనికి ప్రవేశించటానికిమటుకు అందరం ఒకే గుమ్మంలోనుండి లోనికి ప్రవేశించాలి. అలాగే మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాత్మబుద్ధి నశిస్తేనేగాని మీకు అమృతానుభవం కలుగదు. మీకు దేహాత్మబుద్ధి ఉన్నంతకాలం మీ హృదయంలో అత్యంత సమీపంలో నారాయణుడు ఉన్నా ఆయన మీకు గోచరించడు. అందుచేత నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాత్మబుద్ధిని తొలగించుకోవాలి, ఇంకో అవకాశం లేదు.

భగవద్గీతలోని ప్రతీమాట దయతో నిండి ఉంటుంది. మనకు అహంకారం ఉంది కాబట్టి ఆ వాక్యంలో ఉన్న దయ, దానిలో ఉన్న మాధుర్యం మన కళ్ళకు కనబడదు. మన

అస్థిత్వాన్ని దేహానికి పరిమితం చేసుకొంటున్నాము అందుచేత మనకు కళ్ళు ఉండి చూడ లేకపోతున్నాము, భగవంతుడు మంచి మంచి వాక్యాలు చెప్పినా చెవులు ఉండి వాటిని వినలేకపోతున్నాము. మనకు సద్బుద్ధి కనుక లేకపోతే, సత్కర్మ ఆచరించి ఉండకపోతే భగవంతుడు మంచి మంచి మాటలు చెప్పినా వాటి విలువ మనకు తెలియదు. మూడు గుణాల నుండి నీవు బయటపడాలంటే నా నామాన్ని స్మరించు, నా రూపాన్ని ధ్యానించుకో, నా మాటను ప్రమాణంగా పెట్టుకొని జీవించు అని పరమాత్మ చెపుతున్నాడు. నాకు పుష్పం ఇయ్యి, పండు ఇయ్యి, లేకపోతే నీళ్ళు ఇయ్యి అని భగవంతుడు అంటాడు దీని అర్థం ఏమిటి అంటే ఆయన తీసుకొనేది ఆ పండును కాదు, ఆ పండు ద్వారా మన భక్తిని తీసుకొంటాడు. దానిని వంపుపెట్టి మనలను తరింపచేయటానికి అలా చేస్తున్నాడు, ఇది గుర్తు పెట్టుకోండి. మన భక్తి భావనను తీసుకొని మనకు ముక్తిని ప్రసాదిస్తాడు. ముక్తిని ప్రసాదించేవాడే ముకుందుడు. మనం నోటి ద్వారా భగవంతుడిని ఆరాధిస్తున్నాము, పని ద్వారా కూడా భగవంతుడిని ఆరాధించాలి. గీతలో భగవంతుడు ఏమని చెప్పాడు అంటే ఈ కర్మలన్నీ కూడా జ్ఞానంలో పరిసమాప్తమవుతాయి అని చెప్పాడు. మొదటిది కర్మ, చివరిది జ్ఞానం. మాట హితవుగా మాట్లాడండి, ఆహారం మితంగా తీసుకోండి, ధర్మబద్ధంగా జీవించండి అలా వుంటే కర్మలన్నీ జ్ఞానంలో సమాప్తమవుతాయి. కర్మ చెయ్యి, ఎలా చెయ్యాలో తెలుసుండి చెయ్యి. కర్మ నిన్ను బంధించేలాగ నువ్వు కర్మను ఆచరించవద్దు. నువ్వు చేసే కర్మ యోగం అయిపోవాలి, అప్పుడు జ్ఞానంలో నీ కర్మలన్నీ సమాప్తమవుతాయి, అప్పుడు మోక్ష సుఖాన్ని పొందుతావు. అసలు భగవంతుడే ఉన్నాడు, మనం లేము. అన్ని కాలాలలో ఆయన ఉన్నాడు, ఏ కాలంలోను మనం లేము అది తెలియకపోవటం వలన అహంకారం వస్తోంది. ఈశ్వరుడి పట్ల మనకు సజీవమైన విశ్వాసం కనుక ఉంటే, మన మనస్సును ఆయన పాదాల దగ్గర ఉంచితే మనకు వ్యక్తి భావన నశిస్తుంది. వ్యక్తి భావన నశిస్తే దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని వచ్చే తలంపులు రావు, నిన్ను బంధించే తలంపులు రావు. నేను అనేటప్పటికి ఏ దేహభావన అయితే స్ఫురిస్తోందో దానిని తీసుకొని వెళ్ళి భగవంతుడి పాదాలకు సమర్పిస్తే నువ్వు త్రిగుణాలనుండి బయటపడతావు, వ్యక్తిభావన నశిస్తుంది.

మనకు విషయానందం తెలుసు కాని ఆత్మానందం గురించి తెలియదు, దానిని ఎప్పుడూ మనం రుచి చూడలేదు. ఇప్పుడు మనం అనుభవించే సుఖాలు అన్నీ పరిణామంలో దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. ఆత్మానందం స్వతంత్రమైనది. మనకు అసలు భక్తి ఉంటే శాస్త్రంలో చెప్పిన మాట యొక్క రుచి తెలుస్తుంది. మనకు భక్తి లేనప్పుడు శాస్త్రం యొక్క విలువ మనకు తెలియదు. పూర్వం గురువులు ఇలా చెప్పేవారు కాదు, ఎవరికయితే

ముముక్షత్వం ఉందో వారికే ఆత్మజ్ఞానం గురించి బోధించేవారు. భగవంతుడు అంటే మనకు తల్లి. ఇప్పుడు మీరు జీవితంలో ఏదైనా కష్టపడ్డారు అనుకోండి, మా అమ్మాయి కూడా ఇలా కష్టపడితే బాగుండును అని మీరు ఎవరైనా అనుకుంటారా, అలా అనుకోరు. నా కష్టం ఏదో నేను పడ్డాను, మా అమ్మాయి మటుకు సుఖంగా ఉండాలి, ఈ కష్టాలు మటుకు మా అమ్మాయికి రాకూడదు అనుకొంటారు. మీరే అలా అనుకొన్నప్పుడు దేవుడు అలా అనుకోడా. రాగద్వేషములు తగ్గించుకోండి, కోపం తగ్గించుకోండి. ఎందుచేతనంటే వీటివలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది, అందువలన వాటిని తగ్గించుకోండి. బాహ్య ముఖంగా విజృంభిస్తున్న మనస్సుకు లోచూపు కలుగజేసి, అది ఎక్కడ నుండి అయితే ఉదయించి వస్తోందో అక్కడికి నిన్ను తోలుకొని వెళ్ళటానికే భగవంతుడు మానవరూపం ధరించి వస్తాడు. కొంతమంది ధనం ఉండి ఎప్పుడూ బీదార్పులు ఆరుస్తారు అంటే ఎప్పుడూ బీద మాటలు మాట్లాడతారు, అది చాలా చెడ్డ. నిండా ఉన్న పర్సు తగ్గుతూ ఉంటే హృదయం నిండుతుంది, పర్సు నిండుగా ఉంటే హృదయం నిండదు. ఈ సామెత నేను లండన్‌లో విన్నాను. పర్సు కొంచెం పల్చబడుతూ ఉంటేనే హృదయం నిండుతుంది. మనం ఏమనుకొంటు న్నాము అంటే పర్సు నిండుగా ఉండాలి, హృదయం కూడా నిండుగా ఉండాలి అనుకొంటు న్నాము. అలా కాదు పర్సుకు ఎంతో కొంత లావుదనం తగ్గించండి, అప్పుడు హృదయం నిండుగా ఉంటుంది. స్నానం ఎంత ముఖ్యమో, దానం కూడా అంతే ముఖ్యం, జ్ఞానం కూడా అంతే ముఖ్యము. మనకు స్నానం విలువ తెలుస్తోంది కాని దానం యొక్క విలువ తెలియటం లేదు, జ్ఞానం యొక్క విలువ తెలియటం లేదు. జ్ఞానం అంటే కేవలం ఆత్మ జ్ఞానం అని కాదు వివేకం, విచక్షణ అంటే ఏది ఆచరించదగినది, ఏది ఆచరించకూడదు, ఏది మాట్లాడాలి ఏది మాట్లాడకూడదు, ఏది చేయదగినది ఏది చేయకూడదు, ఏది వినదగినది ఏది వినకూడదు అనే విభజన, ఆ విచక్షణ, వివేకం కూడా మనకు చాలా ముఖ్యం. నది ఎన్నో వంపులు తిరుగుతూ వెళ్ళి సముద్రంలో కలుస్తుంది. అలాగే నీవు ఒక మాట మాట్లాడు, ఒక పనిచెయ్యి, ఒక యజ్ఞం చెయ్యి, దానం చెయ్యి ఇవన్నీ కూడా జ్ఞానంలో సమాప్తమవ్వాలి. అట్టి మాట మాట్లాడు, అట్టి కర్మ చెయ్యి అని వేదంలో చెపుతాడు. చంద్రుడు కూడా నాకు గురువే అంటున్నాడు దత్తాత్రేయుడు. కొంత మంది పాపం వాళ్ళచేత, వీళ్ళచేత మాటలు పడతారు కాని వారు మాత్రం చల్లగా ఉంటారు, వారి దగ్గర కూర్చుంటే మనకు చల్లని మాటలు చెపుతారు. ఎవరయినా బాధపడుతూ ఉంటే ఏమండీ ఈ జీవలక్షణాలను ఎలా భరిస్తున్నారు అనేవారు భగవాన్. కొంతమంది వారు క్షోభను అనుభవిస్తూ ఉంటారు కాని మనకు క్షోభను పంచిపెట్టరు, శాంతిని పంచి పెడతారు, జ్ఞానాన్ని పంచిపెడతారు.

సూర్యుని యొక్క వేడి కిరణాలు చంద్రుడి మీద పడతాయి, ఆ వేడి కిరణాలను చల్లబరచి ఆ చల్లని కిరణాలను చంద్రుడు మనకు ఇస్తాడు అందుచేత ఆయన నాకు గురువు అని దత్తాత్రేయుడు చెప్పాడు. నాకు ఆత్మజ్ఞానాన్ని బోధించి, బోధించటమే కాదు దానిని అనుభవంలోనికి తీసుకొని వచ్చి ఈ భూమికి సంబంధించిన మైకాన్ని ఊడగొట్టింది నువ్వే కదా అరుణాచలేశ్వరుడా అంటారు భగవాన్. కోటి విద్యలు కూటి కొరకే ఒక్క ఆత్మజ్ఞానం మాత్రమే నిజమైన జ్ఞానం, అదే సుజ్ఞానం, అదే శాంతిని కలుగ జేస్తుంది. చదువవలెను, చదువవలెను చావులేని చదువు చదువవలెను అంటాడు ప్రహ్లాదుడు. శరీరానికి చావు వచ్చినా, శరీరం చనిపోతున్నప్పటికీ నీకు చావు లేదనే అనుభవం నీకు కలగాలి అటువంటి చదువు చదువవలెను, అదే ఆత్మవిద్య. శివుడికి ఒకపేరు ఉంది త్రిపురాల్ని సంహరించాడు అని. త్రిపురాలను జయించిన వాడికే శాంతి. త్రిపురాలను ఎవడైతే దహించలేడో, ఎవడైతే వాటిని తొలగించుకోలేడో వాడికి అశాంతి. మనకు శాంతి కలుగకుండా అడ్డువచ్చేవి మూడు 1. స్థూలశరీరం, 2. సూక్ష్మశరీరం అంటే మనస్సు, 3. కారణశరీరం అంటే అజ్ఞానం. మనకు మూడు శరీరాలు ఉన్నాయి, వీటినే త్రిపురాలు అంటారు. వీటిని జయించినవాడు కాని శాంతిని పొందలేడు. స్థూలదేహంతో తాదాత్మ్యం పొందినా, లోపల ఉన్న మనస్సుతో తాదాత్మ్యం పొందినా, లోపల ఉన్న అజ్ఞానంతో తాదాత్మ్యం పొందినా నీకు శాంతి దొరకదు. మీ ఆయనకు తలపోటు వస్తే మీరు బాధపడిపోతారు, మీకు కూడా తలపోటు వచ్చేస్తుంది ఎందుచేత ఆయన మీ భర్త కాబట్టి. దానినే బంధం అంటారు. మీ భర్తతో మీకు ఎలా తాదాత్మ్యం ఉంటుందో అలాగే మీ శరీరంతో, మనస్సుతో, అజ్ఞానంతో మీకు తాదాత్మ్యం ఉంటుంది. మీ మనస్సును, మీ దేహాన్ని ఎవరైనా గాయపరిస్తే మీకు అశాంతి వచ్చేస్తుంది. ఈ మూడింటి నుండి విడుదల పొందినవాడే శాంతి సామ్రాజ్యానికి చక్రవర్తి అవుతాడు, వాడు జననమరణ చక్రంలో నుండి విడుదలపొందుతాడు. విష్ణువు చేతిలో చక్రం ఉంటుంది, అది కాలచక్రం, దానిలో జీవకోటిని తిప్పుతూ ఉంటాడు. ఆ కాలచక్రంలోనుండి ఆయనే మనలను విడిపించాలి. అందుచేత మనం ఆయనను ఆరాధించాలి, ఆయన పాదాలను ఆశ్రయించాలి.

భగవాన్ దగ్గరకు ఒకడు వచ్చి ఏమండీ నేను చనిపోయిన తరువాత ఏమౌతాను, నా పూర్వజన్మ ఏమిటి, వచ్చే జన్మలో ఏమౌతాను, నా విధి బాగోలేదేమో అని ఇలా ఏవో చెపుతూ ఉంటే భగవాన్ ఆయన చెప్పినదంతా విన్నారు. ఈ గొడవలన్నీ నీ గాఢనిద్రలో ఎక్కడికి వెళ్ళిపోయినాయి అని అడిగారు. ఒక్కమాట చాలు ఇంక ఎందుకు టీచింగు. ఇప్పుడు నువ్వు చాలా గొడవలు చెపుతున్నావు. గాఢనిద్రలో నీవు ఉన్నావా? లేదా? నీవు ఉన్నావు. అయితే ఈ గొడవలు అన్నీ ఎక్కడికి వెళ్ళిపోయినాయి. ఈ గొడవలు అన్నీ నీ

మనస్సులో ఉన్నాయి. గాఢనిద్రలో నీకు మనస్సు గొడవ లేదు. అందుచేత ఈ గొడవలు ఏమీ అక్కడ లేవు. జాగ్రదవస్థలో మనస్సు వచ్చాక ఈ గొడవలు అన్నీ వస్తున్నాయి. అందుచేత ఇప్పుడు నీ మనస్సును తీసి ఒక ప్రక్కన పెట్టు. అప్పుడు ఏ గొడవ లేదు. ఇదంతా మనస్సుకు సంబంధించిన పెంట, దానిని తీసి ప్రక్కన పెట్టు. కాకిరెట్ట ఎక్కడయినా కనబడితే దానిని జాగ్రత్త పెట్టుకోము, దానితో పేచీ పడము, చీపిరితెచ్చి దానిని ఒక ప్రక్కకు గెంటేస్తాము. అలాగే ఎవడైతే తన మనస్సును కాకిరెట్టలాగ చూడగలడో వాడే అందులోనుండి బయట పడతాడు. నీ మనస్సు నీకు బంగారంలాగ కనబడుతూ ఉంటే అందులో నుండి నీవు ఎలాగ బయటకు వస్తావు. బంగారాన్ని జేబులో పెట్టుకొంటాడుగాని కాకిరెట్టను ఎవడూ జేబులో పెట్టుకోడు. నా మనస్సు నాకు బంగారంలా ఉంది కాబట్టే దానిని జేబులో పెట్టుకొంటాను. నా మనస్సు అది కాకిరెట్టతో సమానం అని నాకు తెలిసినప్పుడు కదా చీపిరిపెట్టి తీసి ఒక ప్రక్కన పడేసేది.

మీరు పదిమందిలో కూర్చుని బడాయిమాటలు చెప్పకండి. రోజూ కొంతసేపు ఏకాంతంగా ఉండి భగవంతుడిని స్మరించుకోండి, ప్రతీ మనిషికి ఏకాంతవాసం అవసరం. భగవంతుడిని స్మరించుకోవటం వలన, ఆయన గురించి మాట్లాడు కోవటం వలన, ఆయనను జ్ఞాపకం పెట్టుకోవటం వలన మనం పవిత్రులం అవుతాము. మనకు పని ఏమీ లేదు, చెయ్యి కడుక్కొన్నామంటే ఎవరో ఒకరి ఇంటికి వెళ్ళి పడిపోతాము. మనం ఏకాంతంగా ఉండి, దైవచింతన చేస్తూ ఉంటే, భగవంతుడి నామాన్ని స్మరించుకొంటూ ఉంటే మనకు తెలియకుండానే మనం నెమ్మదిగా పవిత్రులం అవుతూ ఉంటాము. ఒకటి గుర్తు పెట్టుకోండి. మన లోపల బ్రహ్మం ఉంది. అది ఎంత పవిత్రంగా ఉందో అంత పవిత్రం మనం అయినప్పడే అందులో మనం ఐక్యమవుతాము. అది 100% ప్యూరిటీ. మనం 99% ప్యూరిటీ అయ్యాము అనుకోండి, ఇంకా 1% దోషం మిగిలి ఉంది అనుకోండి, అది కూడా పునర్జన్మను తీసుకొనివస్తుంది. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నది సముద్రంలో కలవటానికి ఎన్నో వంపులు తిరుగుతూ ప్రయాణం చేస్తుంది. మీరు జపం చేసినా, ప్రార్థన చేసినా, ధ్యానం చేసినా, యజ్ఞం చేసినా, శ్రవణం చేసినా, మననం చేసినా, అధ్యయనం చేసినా, ప్రవచనాలు చెప్పినా ఎన్ని చేసినా వీటి అన్నింటియొక్క ప్రయోజనం ఒక్కటే బ్రహ్మంలో ఐక్యమవ్వటమే, అది మర్చిపోవద్దు. మీరు మాట ద్వారానే కాదు, పని ద్వారా కూడా భగవంతుడిని ఆరాధించండి. పూర్వజన్మలలో మనం తెలిసో, తెలియకో సత్కర్మ చేసి ఉంటాము. నిప్పను తెలిసిముట్టుకొన్నా, తెలియక ముట్టుకొన్నా కాలుతుంది అలాగే ఒక మంచి పనిని మనం తెలిసి చేసినా, తెలియక చేసినా దాని ఫలితం ఉంటుంది. అది

